## పట్టణంలో రెండు చోట్ల గొడవలు

**ఒకరిని కరీంనగర్ దవాఖానకు తరలించిన పోలీసులు**

వేములవాడ, జనవరి 15: పట్టణ పరిధిలోని న్యూఅర్బన్‌కాలనీ, భగవంతరావు నగర్ కాలనీలో పలు ఘర్షణలు జరిగాయి. మంగళవారం రాత్రి న్యూఅర్బన్ కాలనీలో ఇద్దరు యువకుల మధ్య జరిగిన మాటా మాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఆ తర్వాత మూకుమ్మడిగా ఒకరిపై ఒకరి దాడి చేసుకోవడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దాడికి పాల్పడుతున్న వారిని చెల్లా చెదురు చేశారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు బుధవారం మధ్యాహ్నం వరకు పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఇదిలా ఉండగా, భగవంతరావునగర్‌లోని తాటికొండ ఫంక్షన్ హాల్‌వద్ద బుధవారం ఉదయం అనుమానాస్పద వ్యక్తులుగా భావించి ఇద్దరు యువకులను కాలనీలోని యువకులు దాడి చేశారు. వారి నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడంతో అనుమానితులుగా పేర్కొంటూ దాడి చేశారు. అయితే గుడికి వెళ్తున్నామని చెప్పినప్పటికీ కూడా కాలనీవాసులోని యువకులు తమపై దాడి చేశారని, బాధితులు వాపోతుండగా, అనుమానాస్పదంగా వ్యవహరించడంతోనే మందలించిన్నట్లుగా కాలనీవాసులు తెలిపారు. దాడిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ దవాఖానకు పోలీసులు తరలించారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడైనా గొడవలు గానీ, అనుమానాస్పద వ్యక్తులు కానీ, కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. చట్టాన్ని చేతిలోకి తీసుకోకుండా తమకు సమాచారం అందించాలని యువతను హెచ్చరించారు. మద్యం తాగి గొడవలకు దిగితే చట్టపరమైన చర్యలు దిగుతామని హెచ్చరించారు. రెండు సంఘటనలపై పోలీస్‌శాఖ తరపున దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

## ప్రభుత్వ భూములు స్వచ్ఛందంగా అప్పగించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ సమక్షంలో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమి అప్పగింత
- మీడియా సమావేశంలో వెల్లడి



ప్రభుత్వ భూమిని కలెక్టర్, ఎస్పీలకు సరెండర్ చేస్తున్న కూనవేని నర్సయ్య

కలెక్టరేట్, జనవరి 15 : జిల్లాలో ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా అప్పగించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పిలుపు నిచ్చారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ హాల్‌లో ప్రభుత్వ భూమి అప్పగింతపై ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తంగళ్లపల్లి మండలం సారంపల్లికి చెందిన కూనవేణి నర్సయ్య గ్రామ సర్వే నంబర్ 464/4లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసుకొని, సాగు చేసుకుంటున్నారని, ప్రభుత్వానికి తిరిగి అప్పగించడానికి నిర్ణయించారని కలెక్టర్ తెలిపారు. తంగళ్లపల్లి మండలంలోని మండేపల్లికి చెందిన బీ లింగం గ్రామ సర్వే నంబర్ 365/అ/2లో ఎకరం ప్రభుత్వ భూమిని ప్రభుత్వానికి తిరిగి అప్పగించడానికి నిర్ణయించారని వివరించారు. జిల్లాలో ఎవరైనా భూఆక్రమణలకు పాల్పడి ఉంటే సదురు భూమిని ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించాలని, ఈ భూములను పేద ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తామని, పేద ప్రజలకు ఇంటి పట్టాల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు వినియోగిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## వివరాలు పక్కాగా ఉండాలి



కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీవో సత్తయ్య

ఎల్లారెడ్డిపేట, జనవరి 15: ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి లబ్ధిదారుల వివరాలు పక్కాగా ఉండాలని ఎంపీడీవో సత్తయ్య పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు, గ్రామసభల్లో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సేకరణకు సంబంధించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా లాంటి పథకాలు లబ్ధిదారులకు అందేందుకు తీసుకోవాల్సిన గైడ్‌లైన్స్‌పై వివరించారు. డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణ, ఎంపీవో జోగం రాజు, వ్యవసాయాధికారి కవిత ఉన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ

తెలంగాణ చౌక్, జనవరి 15: ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని వారి మాటలు నమ్మి అమాయకప్రజలు మోసపోతున్నారని అప్రమత్తంగా ఉండాలని టౌన్ సీఐ కృష్ణ సూచించారు. ఈ మేరకు బుధవారం సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో మీ కోసం కార్యక్రమంలో భాగంగా సామాజిక అంశాలపై అవగాహన కల్పించి, మాట్లాడారు. నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ఎవ్వరైనా మోసపోయినట్లయితే వెంటనే 1930కి కాల్ చేసి, సమాచారం అందజేయాలని సూచించారు. ట్రాఫిక్, గల్ఫ్ ఏజెంట్ల మోసాలు, మహిళా చట్టాలపై, సీసీ కెమెరాల అవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయా ల్లో డయల్ 100కు కాల్ చేయాలన్నారు.

## 19న ఉచిత కంటి ఆపరేషన్లు

బోయినపల్లి, జనవరి 15 : కొదురుపాక బీసీఎం కంటి దవాఖానలో ఈ నెల 19 ఆదివారం ఉచిత కంటి ఆపరేషన్లు చేస్తున్నట్లు ఆ దవాఖాన వ్యవస్థాపకుడు ప్రముఖ కంటి వైద్య నిపుణుడు వైరాగ్యం రాజలింగం-రీట బహదూర్‌షా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలతో పాటు కంటి ఆపరేషన్ అవసరం ఉన్న వారు కొదురుపాక కంటి దవాఖానకు వచ్చి కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. కంటి పరీక్షల అనంతరం వైద్యురాలు బిల్లా అనూషరెడ్డి సిఫారసు మేరకు.. ఉచిత కంటి ఆఫరేషన్ చేస్తున్నట్లు వారు తెలిపారు. కంటి సమస్యలున్న వారు కొదురుపాక బీసీఎం కంటి దవాఖానకు రావాలని కోరారు.

## దాడి ఘటనపై ఫిర్యాదు

సిరిసిల్ల రూరల్, జనవరి 15 : తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో తనతో పాటు తన కుటుంబంపై తంగళ్లపల్లికి చెందిన బండి సాయికృష్ణగౌడ్, గాజుల ప్రవీణ్, గంగ రమణారెడ్డి, అంకారపు మధు అనే నలుగురు వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ మూకుమ్మడిగా దాడి చేసినట్లు మండెపల్లికి చెందిన లింగం సాయిచంద్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ నెల 14న రాత్రివేళలో ఇంటికి వచ్చి రోడ్డుపై విచక్షణారహితంగా కొట్టారని కులం పేరుతో దూషిస్తూ కొట్టారు. భయంతో ఇంట్లోకి గేటు దూకి వచ్చి తల్లి దండ్రుల పైన దాడి చేశారని తెలిపారు. ఈ దాడి ఘటన సమీప సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు వెల్లడించాడు. కులం పేరుతో దూషిస్తూ దాడి చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సాయి తెలిపాడు.

## ఆరోగ్య కేంద్రాల తనిఖీ



ఆరోగ్య కేంద్రంలో హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రజిత

బోయినపల్లి, జనవరి 15 : విలాసాగర్, కొదురుపాక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను బుధవారం జిల్లా వైద్య శాఖ అధికారి రజిత ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు.. ఆమె ఈ మేరకు తనిఖీ చేసి, హాజరు రిజిస్టర్, స్టాకు రిజిస్టర్, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్‌సీడీ (బీపీ, షుగర్, క్యాన్సర్) వ్యాధుల నమోదు ప్రక్రియ లక్ష్యాలు సాధించాలని వైద్య సిబ్బందికి సూచించారు. టీబీ, మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలపై కూడా లక్ష్యాలు సాధించాలని, ఈ సందర్భంగా వైద్యాధికారులకు సూచించారు. వైద్యాధికారులు అనిత, రేణు ప్రియాంక డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, సీహెచ్‌వో సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో వాహన తనిఖీ అధికారి వంశీధర్

ఎల్లారెడ్డిపేట, జనవరి 15 : ఆటో డ్రైవర్లు కచ్చితంగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని మోటర్ వాహన తనిఖీ అధికారి వంశీధర్ సూచించారు. బుధవారం మండలకేంద్రంలోని ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. లైసెన్సు లేకుండా, మద్యం తాగి, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనాన్ని నడపడం చట్టరిత్యా నేరమని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారమే ప్రయాణికులను ఎక్కించుకోవాలని చెప్పారు. ఈ సహాయక వాహన తనిఖీ అధికారి పృథ్వీదర్, కానిస్టేబుల్ ప్రశాంత్, బాబు, ఆటోయూనియన్ ప్రతినిధులు మల్లారెడ్డి, బాలయ్య ఉన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

**సీఐ వెంకటేశ్వర్లు**



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న సీఐ, ఎస్ఐ, నాయకులు

రుద్రంగి, జనవరి 15 : గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మండలంలోని కేంద్రంలోని ఫిట్నెస్ ఫ్రిక్ బ్యాడ్మింటన్ క్లబ్ గ్రౌండ్‌లో మండల పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన షెటిల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ విజేతలకు ఎస్ఐ అశోక్‌తో కలిసి సీఐ వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ యువత క్రీడల్లో మరింత రాణించాలని, క్రీడలతో క్రమశిక్షణ పెరుగుతుందని, మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. యువత గంజాయి, మత్తు, చెడు మార్గాల వైపు వెళ్లకుండా పోలీస్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా, దోస్తీ మీట్ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయమన్నారు. క్రీడల పోటీల నిర్వహణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ పోత్సాహం ఉంటుందన్నారు. యువత ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువుపై దృష్టి సారించి మంచి ఉద్యోగాలు సాధించి తల్లితండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అశోక్, నాయకులు గంగం మహేశ్, ఎర్రం గంగనర్సయ్య, తర్రె మనోహర్, సామ మోహన్, దువ్వాక గంగాధర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మద్యం తాగి డ్రైవ్ చేయొద్దు



మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీకాంత్

ఇల్లంతకుంట, జనవరి 15 : మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న జాతర ఉత్సవాల్లో మద్యం తాగి డ్రైవ్ చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ బుధవారం హెచ్చరించారు. జాతర ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలిగించినా చర్యలు తప్పవన్నారు. జాతర ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001-02 సంవత్సరం పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇల్లంతకుంట, జనవరి 15 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం బుధవారం వైశ్య భవన్‌లో ఘనంగా జరుపుకున్నారు. 1997-98 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు 27 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఒకరికొకరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి గురువులైన రామయ్య, దామోదర్‌రెడ్డితో పాటు పూర్వ విద్యార్థులు ఉన్నారు.

## 21 నుంచి గ్రామసభలు

సిరిసిల్ల రూరల్, జనవరి 15 : ప్రభుత్వ పథకాలైన రైతు భరోసా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 21 నుంచి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి, మండల నోడల్ అధికారి శేషాద్రి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం తంగళ్లపల్లి మండలపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 21న అంకిరెడ్డిపల్లి, తాడూరు, మల్లాపూర్, చీర్లవంచ, గండిలచ్చపేట, జిల్లెల్ల పాపయ్యపల్లె, తంగళ్లపల్లిల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. 22న అంకుసాపూర్, చింతలఠాణా, కస్బెకట్కూర్, మండెపల్లి, రామచంద్రాపూర్, వేణుగోపాల్‌పూర్, ఇందిరానగర్, పద్మానగర్‌లో జరుగుతాయి. 23న బాలమల్లుపల్లె చిన్నలింగాపూర్, దేశాయిపల్లె, గోపాల్‌రావుపల్లె, ఒబులాపూర్, సారంపల్లి, ఇందిరమ్మకాలనీల్లో నిర్వహిస్తారు. 24న నర్సింలపల్లె, రాళ్లపేట, రామన్నపల్లె, బద్దెనపల్లి, బస్వాపూర్, నేరెళ్లలో గ్రామసభలు నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు ప్రకటించారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జాఅహ్మద్ బేగ్, కార్యదర్శులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**LOST**

★తేది: 02-03-2022, బుధవారం రోజున గోదావరిఖని, చంద్రశేఖర్ నగర్‌లోని మా ఇంటి వద్ద నుండి బస్టాండ్‌కి వెళ్తుండగా బస్టాండ్ ఏరియాలో నా యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ (నెం: 514/1981) పోయినది. దొరికిన వారు సంప్ర: ఇనుముల రమాదేవి, W/o. సంజీవ్ కుమార్, సెల్: 98494 02464.
NTK-335663

**CHANGE OF NAME**

★I NADIMETLA GANESH AGAIAH S/O AGAIAH VENKATNARSU NADIMETLA R/o Sapthagiri Colony Karimnagar. Have Changed my name as NADIMETLA GANESH S/O NADIMETLA AGAIAH. For all purposes.
NTK-0000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీలత

## ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన

ముస్తాబాద్, జనవరి 15 : ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలలో లబ్ధిదారుల ఎంపికపై గ్రామస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రత్యేకాధికారి శ్రీలత మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు, సమావేశం నిర్వహిస్తున్నామని ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న పథకాల ఎంపికలో, లబ్ధిదారులను ఎంపిక చేయడంలో పారదర్శకంగా వ్యవహరించి, అర్హులైన వారిని ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరయ్య, తహసీల్దార్ సురేశ్, ఏపీవో ఆనంద్, మండల స్థాయి అధికారులతో పాటు గ్రామ ముఖ్య అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ఒకరి అరెస్ట్

తెలంగాణ చౌక్, జనవరి 15: సిరసిల్ల పట్టణం తాళంవేసిన ఇంట్లో దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని సిద్ధార్థనగర్‌కు చెందిన ఎడవెల్లి శ్రీనివాస్ గత ఆదివారం వ్యక్తిగత పని కోసం ఇంటికి తాళం వేసి వెళ్లగా, రాత్రిపూట తాళం పగలకొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదు, వెండి ఆభరణాలను దొంగతనం చేసినట్లు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీస్‌లు రంగంలోకి దిగి సాంకేతిక పరిజ్ఞానం (ఫింగర్ ప్రిట్స్) సాయంతో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కేమ్మసరం సురేశ్‌గా గుర్తించి పట్టుకొని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమించొద్దు

సిరిసిల్ల రూరల్, జనవరి 15 : ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ఉన్న వారు స్వచ్ఛందంగా కలెక్టర్‌కు అప్పగించాలని, లేకుంటే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని, తంగళ్లపల్లి ఎస్సై రామ్‌మోహన్ తెలిపారు. ఇప్పటికే మండలంలోని పలువురిపై కేసులు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. వారికి సహకరించిన అధికారులపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

## నిబంధనలు పాటించకపోతే లైసెన్స్ తొలగిస్తాం

తిమ్మాపూర్, జనవరి15: మండల కేంద్రంలోని జిల్లా రవాణా కార్యాలయంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ సేవల కోసం వచ్చిన వాహనదారులు, తదితరులకు డీటీవో శ్రీకాంత్‌చక్రవర్తి అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు పాటించనివారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, లైసెన్స్ తొలగిస్తామని హెచ్చరించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ఏకాగ్రతతో ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐలు స్రవంతి, హరితయాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

## రగుడులో క్రికెట్ టోర్నమెంట్

సిరిసిల్ల రూరల్, జనవరి 15: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడులో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని డా. గొడిసెల కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇక్కడ విజేతగా నిలిచిన గుగ్గిల్ల బాబు టీమ్‌కు నగదు పురస్కారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ గుగ్గిల్ల అజయ్‌గౌడ్ పాల్గొన్నారు.



విజేతకు బహుమతులు అందజేస్తున్న అజయ్‌గౌడ్

## రోడ్డు ప్రమాదంలో ఒకరి గాయాలు

వేములవాడ రూరల్, జనవరి 15: మండలంలోని అనుపురం గ్రామంలో ద్విచక్రవాహనం ఢీ కొనడంతో శివకుమార్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌కు చెందిన శివకుమార్ బైక్‌పై కొదురుపాక వైపు వెళ్తుండగా కరీంనగర్ నుంచి వస్తున్న కారు అనుపురం బస్టాండ్ వద్ద బైక్ ఢీ కొనడంతో శివకుమార్‌కు తీవ్ర గాయాలు కాగా, వేములవాడకు తరలించారు.

## ఒకరి ఆత్మహత్య

వేములవాడ రూరల్, జనవరి 15: వేములవాడ పట్టణంలోని నాంపెల్లికి చెందిన బత్తుల రాజవ్వ(21) వివాహిత మనస్థాపంలో గుడిసెలో ఊరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన బత్తుల రాజవ్వ కుటుంబం వలుస వచ్చి వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపెల్లి వద్ద గుడిసె వేసుకొని జీవిస్తున్నారు. రాజవ్వకు బావుసాయిపేటకు చెందిన రాములుతో రెండేళ్ల క్రితం వివాహమైంది. పిల్లలు కాలేదు.. దీంతో రాజవ్వ ఎవరూలేని సమయంలో ఊరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. రాజవ్వ కుటంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు

## అనుమతిలేని క్లినిక్ సీజ్

- కలెక్టర్ అదేశాలతో సీజ్ చేశామని వెల్లడించిన అధికారులు
- నాంపెల్లిలో ఉద్రిక్తత



క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

వేములవాడ రూరల్, జనవరి 15: ప్రభుత్వ అనుమతులు లేవని ఓ క్లినిక్‌ను సీజ్ చేయడానికి వచ్చిన అధికారులను అడ్డుకున్న ఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపెల్లిలో జరిగింది. వేములవాడ మున్సిపల్ పరిధిలో నాంపల్లిలో కొన్నేళ్లుగా నడుపుతున్న శ్రీనివాస్ క్లినిక్‌ను సీజ్ చేశారు. కాగా, చాలా ఏండ్లుగా ఆర్ఎంపీ వైద్యుడిగా కొనసాగుతున్న శ్రీనివాస్‌కు ఎలాంటి అనుమతులు లేవని, వైద్యాధికారులు రాత్రి నాంపెల్లికి చేరుకొని ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసేందుకు వెళ్తున్న జిల్లా వైద్యాధికారి రజిత, తహసీల్దార్ మహేశ్‌తో పాటు వైద్యాధికారులను స్థానికులు అడ్డుకున్నారు. చాలా రోజులు వైద్య సేవలు అందిస్తున్న శ్రీనివాస్ క్లినిక్‌ను సీజ్ చేయొద్దని అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పట్టణ సీఐ వీరప్రసాద్ అక్కడి చేరుకున్నారు. పోలీసులు బందోబస్తే మధ్య క్లినిక్‌ను సీజ్ చేశారు. ఎందుకు సీజ్ చేస్తున్నారో అధికారులు చెప్పాలని స్థానికులు డిమాండ్ చేశారు. కాగా, కలెక్టర్ ఆదేశాల ప్రకారం.. సీజ్ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కావాలనే కొంత మంది ఆర్ఎంపీ శ్రీనివాస్‌పై కక్ష పెంచుకొని సీజ్ చేయించిన్నట్లు అక్కడి స్థానికులు వెల్లడించారు. అలాగే చెరువు పక్కనే ఉన్న శిఖం భూమిని ఆర్ఎంపీ వైద్యుడు శ్రీనివాస్ అక్రమించుకున్నారని, ప్రహరీని కూడా కూల్చివేసిన్నట్లు స్థానికులు తెలిపారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాల పట్టివేత



గన్నెవానిపల్లె శివారులో మట్టి కుప్పలు

ముస్తాబాద్, జనవరి 15: ముస్తాబాద్ మండలంలోని గన్నెవానిపల్లె శివారులో గల గుట్టబోరు వద్ద అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుండగా బుధవారం రెవెన్యూ అధికారులు పట్టుకుని వాహనాలను స్వాధీనం చేసుకున్నారని స్థానికులు తెలిపారు. అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తవ్వుతూ టిప్పర్లలో తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు సదరు స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. సరైన పత్రాలు, అనుమతులు లేని కారణంగా వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

## గ్రామాల్లో వాలీబాల్ పోటీలు

ముస్తాబాద్, జనవరి 15: సంక్రాంతి సెలవులను పురస్కరించుకొని వివిధ గ్రామాల్లో యువతకు క్రీడా పోటీలు నిర్వహించారు. ముస్తాబాద్ మండలం గూడెం, రామలక్ష్మణపల్లెల్లో దాతలు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులతోపాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి సంబురాలు

సిరిసిల్ల టౌన్, జనవరి 15: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని పలు వార్డులో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 21వ వార్డులో బీఆర్ఎస్ నేత ఎలువు వేంకటేశం, 24వ వార్డులో స్థానిక కౌన్సిలర్ బుర్ర లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో స్థానిక యువతులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని అందమైన ముగ్గులు వేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చేతుల మీదుగా నిర్వాహకులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల వనజ, దార్ల సందీప్, బుర్ర మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి, జనవరి 15 : మండలంలోని బడితండా గ్రామంలో మహిళలు ముగ్గులు, యువకులు ఆటలు, చిన్నారులు పతంగుల ఎగురవేసి, ఉల్లాసంగా జరుపుకున్నారు. ముగ్గుల పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన మహిళలకు ఎస్ఐ అశోక్, ప్రజాప్రతినిధులు బహుమతులు అందజేశారు. మాజీ సర్పంచ్ మాలీ బాయి, మాజీ ఉప సర్పంచ్ కోటిబాయి, నాయకులు రాందాస్, మదన్‌లాల్, గజన్, మహేందర్ పాల్గొన్నారు.



రుద్రంగి : బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ, నాయకులు

వేములవాడ రూరల్, జనవరి 15 : వేములవాడ, వేములవాడ రూరల్ మండలంలో సంక్రాతి వేడుకలు ఘనంగా జరిగాయి. యువత కోసం గ్రామాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు బహుమతులను అందజేశారు. ఆరెపల్లి, రుద్రవరం, అనుపురం, వట్టెంల, శాత్రాజుపల్లిలో క్రికెట్ పోటీలు నిర్వహించారు.

ఎల్లారెడ్డిపేట, జనవరి 15: నారాయణపూర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నారాయణపూర్‌లో సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీని నిర్వహించారు. విజేతలకు నగదు పురస్కారాన్ని అందించారు. ఇక్కడ నిర్వాహకులు నిమ్మ నారాయణ రెడ్డి, మోతె దేవిరెడ్డి, లద్దునూరి తిరుపతి, పాత లింగన్న, సూర నర్సయ్య, రమేశ్, బాలనర్సు, స్వామి ఉన్నారు.




సిరిసిల్ల టౌన్ : విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ

సిరిసిల్ల రూరల్, జనవరి 15: తంగళ్లపల్లి మండలకేంద్రంలో ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు ఎడ్మల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అదేవిధంగా పద్మనగర్‌లోని పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు మోర శ్రీకాంత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మహిళలు, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్, జనవరి 15 : పట్టణంలోని ప్రతి వీధిలో పలువురు యువతులు, మహిళలు ముగ్గులు వేయడంలో ఒకరికి ఒకరి పోటీపడి ముగ్గులు వేసి, వారి ఆనందాలను ఇతరులతో పంచుకున్నారు. కనుమ పండుగ సందర్భంగా మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.